క్లుప్తంగా

ఎమ్మెల్యేకు వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న గొర్రెలకాపర్లు

బోయినపల్లి: మండలంలోని కొదురుపాక గ్రామానికి చెందిన గొర్రెల కాపర్లు తమ సమస్యలు పరిష్కరించాలని కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కూస రవీందర్ ఆధ్వర్యంలో మంగళవారం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను కలిసి వినతిపత్రం సమర్పించారు. గొర్రెల మేత కోసం గ్రామంలో ఐదెకరాల స్థలం, గొర్రెల మందలు ఏర్పాటు చేసుకోవడానికి షెడ్లను నిర్మించాలని ఎమ్మెల్యేను కోరారు. ఎమ్మెల్యే స్పందిస్తూ, జిల్లా కలెక్టర్‌తో మాట్లాడడంతో పాటు కలెక్టర్‌కు లేఖ రాశారు.నాగుల వంశీగౌడ్, శాలివాహన శ్రీనివాస్ ఉన్నారు.

దుర్గాబాయికి నివాళి



నివాళి అర్పిస్తున్న విద్యార్థులు

వేములవాడ: స్వాతంత్ర్య సమరయోధురాలు దుర్గాబాయి దేశ్‌ముఖ్ 116వ జయంతిని పురస్కరించుకుని మంగళవారం పట్టణంలోని న్యూఅర్బన్‌కాలనీ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. హెచ్‌ఎం విక్కుర్తి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో నాణ్యమైన దిగుబడులు

బోయినపల్లి: రైతులు రసాయన మందులు వాడకుండా పంటలు పండిస్తే నాణ్యమైన దిగుబడి సాధించడంతో పాటు, ఆరోగ్యకరమైన జీవనశైలి మెరుగు పడుతుందని అమ్మ స్వచ్ఛంద సంస్థ స్థాపకుడు శ్రీకాంత్ పేర్కొన్నారు. విలాసాగర్ రైతువేదికలో మంగళవారం రైతులకు అవగాహన కల్పించారు. ఒక దేశీ ఆవు ఉండాలని, జీవామృతం తయారు చేసుకొని పంటలు పండించాలని కోరారు. మండల వ్యవసాయ అధికారి ప్రణీత, ఏఈవో రజిత ఉన్నారు.

నైపుణ్యాలను పెంపొందించుకోవాలి



మాట్లాడుతున్న మధుసూదన్‌రెడ్డి

వేములవాడరూరల్: విద్యార్థులు చదువుతో పాటు నైపుణ్యాలు పెంపొందించుకుంటే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని ఎస్సార్ డిగ్రీ, పీజీ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ డా.బుర్ర మధుసూదన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని హన్మాజీపేట జెడ్పీహెచ్‌ఎస్‌లో జరిగిన కార్యక్రమానికి హాజరై విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. ప్రతీ విద్యార్థి క్రమశిక్షణతో కూడిన జీవన విధానం అలవాటు చేసుకుంటే తప్పక తమ లక్ష్యాన్ని చేరుకోవచ్చని తెలిపారు. హెచ్‌ఎం శ్రీకాంత్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టీచర్ల డెప్యూటేషన్ రద్దు చేయండి

కోనరావుపేట: మండలంలోని కనగర్తి ప్రాథమిక పాఠశాల (ఎస్టీకాలనీ)లో ఉపాధ్యాయుల డెప్యూటేషన్‌ను రద్దు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాధికారిని కోరారు. పాఠశాలలో 23 మంది విద్యార్థులున్నారని, ఇందులో పని చేస్తున్న ఇద్దరు ఉపాధ్యాయులను డెప్యూటేషన్‌పై వేరే పాఠశాలకు కేటాయించారని పేర్కొన్నారు. ప్రైవేట్‌లో చదువుతున్న తమ చిన్నారులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించామని, ఇప్పుడు ఉపాధ్యాయులను వేరే స్కూల్‌కు పంపిస్తే ఎలా అని ప్రశ్నించారు.

దివ్యాంగుల పింఛన్ పెంచాలి

కోనరావుపేట: కాంగ్రెస్ హామీ ఇచ్చిన విధంగా దివ్యాంగులకు రూ.6 వేల పింఛన్ అందించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ ఎలగందుల బిక్షపతి అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం మాటాడారు. వికలాంగులు, ఆసరా పెన్షన్‌దారులను ఏకం చేసి ఆగస్టు 13న ఎల్‌బీ స్టేడియంలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని, ఈక్రమంలో ఈ నెల 27న జిల్లాలో జరిగే కార్యక్రమానికి మందకృష్ణ మాదిగ హాజరవుతారని పేర్కొన్నారు. నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

బిల్లులు మంజూరు చేయాలి

వీర్నపల్లి: మండల కేంద్రంలోని అంబేద్కర్‌నగర్‌కాలనీలో డబుల్ బెడ్రూం బిల్లులు రాలేదని బాధితులు మంగళవారం నిరసన తెలిపారు. మండల అభివృద్ధికి రోడ్డుకు ఇరువైపులా ఉన్న ప్రజలు సహకరించాలని గ్రామ పెద్దలు చెప్పడంతో వారి మాటలు విని ఉన్న ఇండ్లు కూలగొట్టుకున్నామన్నారు. బాధిత కుటుంబాలకు డబుల్ బెడ్రూం మంజూరు చేస్తామని హామీ ఇవ్వడంతో అప్పు తెచ్చి ఇల్లు కట్టుకున్నామని, సదరు బిల్లులు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. రమేశ్, ఇసాక్, సంజీవ్, ఆనందం, కాంతయ్య, బాబు, తదితరులు ఉన్నారు.



వట్టెంల ప్రధాన రోడ్డు పక్కన డ్రైనేజీ దుస్థితి



నూకలమర్రిలో రోడ్డుపై పారుతున్న నీరు

రోడ్డెక్కిన మురుగు

వేములవాడరూరల్: మండలంలోని పలు గ్రామాల్లో పారిశుధ్యం అస్తవ్యస్తంగా తయారైంది. చాలా గ్రామాల్లో డ్రైనేజీలు నిండిపోయి చెత్తాచెదారం, మురుగునీరు రోడ్లపై పారుతోంది. అధికారులు పారిశుధ్య చర్యలు చేపట్టకపోవడంతో ఈగలు, దోమలతో ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. వర్షాకాలం నేపథ్యంలో వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్యంపై దృష్టి సారించాలని జిల్లా అధికారులు ఆదేశించినా మండలస్థాయి అధికారులు ఆ దిశగా పనులు చేయడం లేదని ఆరోపణలు ఉన్నాయి. మాజీ ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడం, ప్రత్యేక అధికారులు గ్రామాలకు రాకపోవడంతో తమ బాధలు ఎవరికి చెప్పుకోవాలో పల్లె ప్రజలకు తెలియడం లేదు.

వారంలో రెండుసార్లు డ్రై డే

వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున వారంలో మంగళ, శుక్రవారం డ్రై డే పాటిస్తున్నాం. వాటర్ ట్యాంకుల్లో బ్లీచింగ్ చల్లిస్తున్నాం. ఇంటింటా తిరిగి నీటి నిల్వలను తొలగించి, ఆయిల్ బాల్స్, బ్లీచింగ్, సున్నం వేయిస్తున్నాం. పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

– శ్రీనివాస్, ఎంపీడీవో, వేములవాడరూరల్

పేదలకు అండగా కాంగ్రెస్ పార్టీ



మాట్లాడుతున్న ప్రకాష్

సిరిసిల్లఅర్బన్: పేదల సంక్షేమం కోసం కాంగ్రెస్ పనిచేస్తుందని పార్టీ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్ అన్నారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల కోసం కమిటీలు వేసి అర్హులకు మాత్రమే ఇండ్లు ఇవ్వడం జరుగుతుందన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు అసత్యపు ఆరోపణలు మానుకోవాలని, ఆ పార్టీ ప్రభుత్వ హయాంలోనే అవినీతి అక్రమాలు జరిగాయన్నారు. మన ఊరు–మన బడి బిల్లులు మూడేళ్లుగా రావడం లేదని ఆరోపించారు. ఇందిరమ్మ ఇండ్లకు ఇసుక కొరత లేదని పేర్కొన్నారు. నాయకులు గడ్డం నర్సయ్య, ఆడెపు చంద్రకళ, వైద్య శివప్రసాద్, ఆకునూరి బాలరాజు, ఆడెపు ప్రభాకర్, ఎల్లె లక్ష్మినారాయణ, రెడ్డినాయక్, బీమారం శ్రీనివాస్, కములాకర్‌రావు పాల్గొన్నారు.

ముదిగొండ ఘటనపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న రవిగౌడ్

సిరిసిల్లఅర్బన్: నల్గొండ జిల్లా ముదిగొండ ఆశ్రమ పాఠశాలలో సుమారు 35 మంది విద్యార్థులు ఫుడ్ పాయిజన్‌కు గురైన ఘటనపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్ అన్నారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో మాట్లాడారు. రాష్ట్రంలో 20 నెలల్లో దాదాపు 90 మంది గురుకుల విద్యార్థులు మృతిచెందారన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలన్నారు. లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామన్నారు. అనిల్‌గౌడ్, సాయి, సూర్య, అఫ్రోజ్, శ్రీనివాస్, జోహెల్, అక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

సూరమ్మ ప్రాజెక్టు పనులు వేగవంతం చేయాలి



పనులు పరిశీలిస్తున్న తిరుపతి, అధికారులు

రుద్రంగి: సూరమ్మ ప్రాజెక్టు పనులు త్వరగా పూర్తి చేయాలని రుద్రంగి మార్కెట్ కమిటీ చైర్మన్ చెలకల తిరుపతి కోరారు. విప్ ఆది శ్రీనివాస్ ఆదేశాల మేరకు మంగళవారం సూరమ్మ ప్రాజెక్టు పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రాజెక్టుకు ఇరువైపులా రెండు తూములు, కాలువలు నాణ్యతతో నిర్మించాలని అధికారులు, కాంట్రాక్టర్‌లకు సూచించారు. ఇరిగేషన్ ఏఈ ఉషర్‌సింగ్, డీసీసీ కార్యదర్శి గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, మండల అధ్యక్షుడు తూము జలపతి, గండి నారాయణ ఉన్నారు.

కాంగ్రెస్‌పై విమర్శలు సరికాదు

తంగళ్లపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్‌ఎస్ నాయకులు విమర్శలు చేయడం సరికాదని పార్టీ మండల అధ్యక్షుడు ప్రవీణ్ జే టోని అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో మాట్లాడారు. ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపులో ఎవరూ డబ్బులు తీసుకోలేదని పేర్కొన్నారు.

బురదజల్లే ప్రయత్నం మానుకోవాలి

ఇల్లంతకుంట: కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్‌ఎస్ నాయకులు బురదజల్లే ప్రయత్నం మానుకోవాలని మానకొండూరు నియోజకవర్గ కాంగ్రెస్ అధికార ప్రతినిధి పసుల వెంకటి అన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో అనంతారం గ్రామంలో డబుల్ బెడ్రూంలకు ప్రొసీడింగ్స్ ఇచ్చి ఎందుకు సాంక్షన్ ఇవ్వలేదని ప్రశ్నించారు.

పేదలు బాగుపడితే ఓర్వలేని బీఆర్‌ఎస్

ముస్తాబాద్: పేదలకు ప్రభుత్వ పథకాలు అందిస్తుంటే చూసి ఓర్వలేని బీఆర్‌ఎస్ నేతలకు ప్రజలు బుద్ధి చెప్పాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి అన్నారు. ముస్తాబాద్‌లో పారదర్శకంగా ఇండ్లు కేటాయిస్తుంటే దానిపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. కొప్పు రమేశ్, కొండయ్య, రంజానీ నరేశ్, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా..

వీర్నపల్లి మోడల్ స్కూల్‌లో స్పాట్ అడ్మిషన్లు

వీర్నపల్లి: మండలంలోని మోడల్‌స్కూల్‌లో 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు మిగిలిన సీట్లకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అశోక్ తెలిపారు. స్పాట్ అడ్మిషన్లు కోసం విద్యార్థులు గురువారం ఉదయం 10 గంటలకు సర్టిఫికెట్లతో హాజరుకావాలని పేర్కొన్నారు.

అధిక ధరకు ఇసుక విక్రయిస్తే చర్యలు

ముస్తాబాద్: మండలంలో ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఇసుక విక్రయించాలని తహసీల్దార్ సురేశ్ అన్నారు. మంగళవారం పంచాయతీ కార్యదర్శులు, ట్రాక్టర్ల యజమానులతో సమావేశం నిర్వహించారు. ట్రాక్టర్ ఇసుకను రూ.1,500 విక్రయించాలని స్పష్టం చేశారు.

ఎక్కువ డబ్బు వసూలు చేయొద్దు

ఇల్లంతకుంట: ఇందిరమ్మ ఇండ్ల మెటీరియల్‌కు ఎక్కువ డబ్బు వసూలు చేయొద్దని తహసీల్దార్ ఎంఏ ఫారూక్ అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ట్రాక్టర్ ఓనర్లతో సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో శశికళ పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ అందజేత

ముస్తాబాద్: ముస్తాబాద్‌లో కాలడి శ్రీఆదిశంకరచార్యుల మఠం ఆధ్వర్యంలో మంగళవారం పేద విద్యార్థులకు స్టడీ మెటిరియల్ అందజేసినట్లు మఠం క్షేత్ర ఆచార్యులు ఉన్నికృష్ణన్ నంబూద్రి తెలిపారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

చందుర్తి: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకుంటేనే సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని మిల్ లెవల్ హెల్త్ ప్రొవైడర్ (ఎంఎల్‌హెచ్‌పీ) నవ్యజ్యోతి అన్నారు. మంగళవారం బండపల్లి రెండో అంగన్‌వాడీ కేంద్రంలో ఆరోగ్యలక్ష్మీ పథకం కమిటీ సభ్యుల సమావేశం నిర్వహించారు.

ఇందిరమ్మ ఇళ్ల ప్రగతిపై సమీక్ష

గంభీరావుపేట: మండలంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల ప్రగతిపై ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఉన్నతాధికారులు సమీక్ష జరిపారు. నిబంధనల ప్రకారం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇసుక, మొరం కేటాయించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

'సెస్'ను కాపాడుకోవాలి

సిరిసిల్లఅర్బన్: జిల్లాలోని సెస్ సంస్థలను వినియోగదారులు కాపాడుకోవాలని సెస్ రిటైర్డ్ ఏడీ వీరారెడ్డి కోరారు. రిటైర్డ్ ఉద్యోగుల మెడికల్ రీయింబర్స్‌మెంట్ కొనసాగించాలన్నారు.

ఎల్లారెడ్డిపేటలో ఆధార్ కేంద్రం

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలోని కిషన్‌దాస్‌పేటలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో సత్తయ్య తెలిపారు.

రికార్డులు ఎలా మిస్సవుతాయి

ఇల్లంతకుంట: మండలంలోని పెద్దలింగాపూర్‌లో భూ సర్వే చేసిన రికార్డులకు సంబంధించిన ఫైల్ తహసీల్దార్ కార్యాలయంలో అడిగితే మిస్ అయిందని చెబుతున్నారని, ఫైల్ ఎలా మిస్సవుతుందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గన్నారం నరసయ్య అన్నారు. కార్యాలయ సిబ్బంది ఫైల్‌ను మాయం చేసి ఉంటారని ఆరోపించారు.

రుద్రంగి ప్రిన్సిపాల్‌గా భార్గవిదేవి



ప్రిన్సిపాల్‌ను సన్మానిస్తున్న అధ్యాపకులు

రుద్రంగి: రుద్రంగి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా సీహెచ్.భార్గవిదేవి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్‌ను అధ్యాపకులు సన్మానించారు.

ముస్తాబాద్ ఎంపీడీవోగా లచ్చాలు



ముస్తాబాద్: ముస్తాబాద్ ఎంపీడీవోగా పి.లచ్చాలు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇన్‌చార్జి ఎంపీడీవో బీరయ్య ఈమేరకు లచ్చాలుకు బాధ్యతలు అప్పగించారు. జగిత్యాల జిల్లా బీర్‌పూర్ ఎంపీడీవోగా పనిచేస్తున్న లచ్చాలును అధికారులు ముస్తాబాద్‌కు బదిలీ చేశారు.

వీర్నపల్లి ఇన్‌చార్జి ఎంపీడీవో బదిలీ

వీర్నపల్లి: వీర్నపల్లి ఇన్‌చార్జి ఎంపీడీవో అబ్దుల్ వాజిద్ మంగళవారం ముస్తాబాద్ ఎంపీవోగా బదిలీ అయ్యారు. అక్కడ ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న బీరయ్య వీర్నపల్లిలో బుధవారం బాధ్యతలు స్వీకరించనున్నారు.

బ్రోచర్ ఆవిష్కరణ



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్ తదితరులు

సిరిసిల్లఅర్బన్: కరంనగర్‌లో సెప్టెంబర్ 7న షావలిన్ కుంగ్ ఫూ బ్రూస్ మార్షల్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహించే థర్డ్ స్టేట్ లెవల్ కరాటే పోటీలకు సంబంధించిన బ్రోచర్‌ను మంగళవారం జిల్లా ఆర్గనైజర్ ఎనగందుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిరిసిల్లలో ఆవిష్కరించారు. జిల్లా నుంచి విద్యార్థులు అత్యధికంగా పాల్గొని ప్రతిభ కనబరిచి పతకాలు సాధించాలని కోరారు. జిల్లా ఆల్ స్టైల్ మార్షల్ ఆర్ట్స్ సీనియర్ మాస్టర్స్ నేరెళ్ల శ్రీధర్, ఓరగంటి రామకృష్ణ, కనుకయ్య, సమ్మయ్య, ఎండీ సమీనా, దివ్య, విక్రమ్, ఉమ తదితరులు పాల్గొన్నారు.

మండలస్థాయి సమావేశం బహిష్కరణ

తంగళ్లపల్లి/వేములవాడరూరల్: తంగళ్లపల్లి, వేములవాడరూరల్ మండలాల ఫీల్డ్ అసిస్టెంట్లు మంగళవారం మండలస్థాయి సమావేశాన్ని బహిష్కరించారు. ఆయా మండలాల ఎంపీడీవోలకు వినతిపత్రం అందించిన అనంతరం మాట్లాడారు. మూడు నెలలుగా ఫీల్డ్ అసిస్టెంట్లకు వేతనాలు చెల్లించలేదని దీంతో ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి వేతనాలు అందించాలని కోరారు. మండలాల అధ్యక్షుడు కె.దేవయ్య, పారెల్లి రమణ తదితరులు పాల్గొన్నారు.

మహాధర్నాకు తరలిన నాయకులు

ఎల్లారెడ్డిపేట: హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద మంగళవారం బీసీ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన మహాధర్నాకు ఎల్లారెడ్డిపేట మండలం నుంచి బీసీ సంఘాల నాయకులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. నాయకులు వరుస కృష్ణహరి, కొండ రమేశ్‌గౌడ్, రామ భీమేశ్వర్, తడుకల దేవరాజు, అందే సురేశ్, సింగారం దేవరాజు, తడుకల స్వామి, జబ్బర్, పెంజర్ల శ్రీనివాస్, కర్ల శేఖర్, సత్తయ్య, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: బీసీల మహాధర్నాకు మండలం నుంచి బీఆర్‌ఎస్ నాయకులు తరలివెళ్లారు. మండల అధ్యక్షుడు గజభీంకార్ రాజన్న, బీఆర్‌ఎస్వీ రాష్ట్ర నాయకుడు జక్కుల నాగరాజు, కోడి అంతయ్య, వొజ్జెల అగ్గిరాములు, అడ్డగట్ల భాస్కర్, బుస్స లింగం, భాస్కర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్ గ్రామంలో కోతులు ఇళ్లను గుల్ల చేస్తున్నాయి. అడ్డుకున్న వారిపై దాడులు చేస్తున్నాయి. కోతుల దాడిలో పలువురు తీవ్ర గాయాలకు గురయ్యారు. వాటితో వేగలేక చాలా మంది అప్పు చేసి ఇండ్ల చుట్టూ సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేసుకుంటున్నారు. పంచాయతీ అధికారులు కోతులను బంధించి ఊరు దాటించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి :
జాఫర్, కార్యదర్శి, నారాయణపూర్, సెల్ నంబర్: 96408 32448

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

కాంగ్రెస్‌ది కక్ష సాధింపు పాలన



బాధితులతో మాట్లాడుతున్న లక్ష్మీనర్సింహారావు

వేములవాడ: అధికారం ఉందని ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే ప్రజలు తిరగబడి కర్రుకాల్చి వాత పెడతారని బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనర్సింహారావు అన్నారు. వేములవాడ రోడ్ల విస్తరణ పనులను మంగళవారం పరిశీలించారు. దారిపొడవునా బాధితులు, చిరువ్యాపారులతో మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, బాధితులకు పరిహారం, కనీస సమయం ఇవ్వకుండా ఆగమేగాల మీద దుకాణాలు, నివాసాలను కూల్చివేసిన విషయం మరవకముందే రాత్రివేళ జేసీబీలతో తిప్పాపూర్ బస్టాండ్ వద్ద దుకాణాలను కూల్చేశారన్నారు. కూల్చివేతలకు గంట సమయం కూడా ఇవ్వని అధికారులు, నెల రోజులు గడుస్తున్నా కనీసం తట్టెడు మట్టి ఎత్తలేదన్నారు. రహదారికి ఇరువైపులా మట్టి దెబ్బలు, శిథిలాలు కుటుంబాలను కలచి వేస్తున్నాయని, నడవడానికి వీలులేకుండా ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తూ కక్ష సాధింపు పాలన కొనసాగిస్తున్నారని విమర్శించారు. ఇంత జరుగుతున్నా ఎమ్మెల్యే నిమ్మకు నీరెత్తినట్టు వివరిస్తున్న తీరు బాధాకరమన్నారు. విస్తరణలో ఇళ్లు కోల్పోతున్న వారికి భారీ భవనం కడుతున్నామని ప్రభుత్వం కోర్టుకు వివరణ ఇచ్చిందని, కాగా, భవనం కడుతున్న విషయం స్థానిక ఎమ్మెల్యే ఇప్పటివరకు నిర్వాసితులకు ఎందుకు చెప్పలేదని ప్రశ్నించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.

దీర్ఘకాలిక వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ఎల్లారెడ్డిపేట: దీర్ఘకాలిక వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ వైద్యాధికారి సారియా అంజుమ్ అన్నారు. మండలంలోని పదిరలో మంగళవారం ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా టీబీ, క్షయ, దీర్ఘకాలిక వ్యాధులపై అవగాహన కల్పించారు. పలువురికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. టీబీ సూపర్‌వైజర్ మహిపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

వేములవాడరూరల్: టీబీ నివారణే లక్ష్యంగా పని చేస్తున్నామని వైద్యాధికారి దివ్యశ్రీ అన్నారు. వేములవాడ మున్సిపల్ పరిధిలోని ఆర్యవైశ్య వాసవి నిత్యాన్న సత్రంలో 102 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లా కో ఆర్డినేటర్ సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బోయినపల్లి: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌ను మంగళవారం పీహెచ్‌సీ వైద్యాధికారి కార్తీక్ సందర్శించారు. విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. స్కూల్ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ రఘునాథ్, సూపర్‌వైజర్ శశి, హేమలత పాల్గొన్నారు.

ఇసుక దోపిడీ చేసిందే బీఆర్‌ఎస్



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

ఎల్లారెడ్డిపేట: జిల్లాలో ఇసుకను అడ్డగోలుగా దోపిడీ చేసింది బీఆర్‌ఎస్ పార్టీ నాయకులేనని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, పార్టీ మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. పదేళ్లలో ఇసుకను బీఆర్‌ఎస్ నాయకులు అందినంత దోచుకుని మానేరువాగును మట్టి వరకు తీసిన ఘనత వారిదేనన్నారు. నేడు ఇందిరమ్మ ఇండ్లకు ఇసుక ఇబ్బంది అవుతుందని వారు మాట్లాడడం సిగ్గుచేటన్నారు. అలాగే మండలంలోని దుమాల తుర్కాసికాలనీలో ఇందిరమ్మ ఇళ్ల పురోగతిని నర్సయ్య పరిశీలించారు. లబ్ధిదారులు సకాలంలో నిర్మాణాలు పూర్తి చేసుకోవాలన్నారు. ప్రభుత్వ పరంగా ఇసుక, మట్టి ఇబ్బందులు లేకుండా చుస్తామని పేర్కొన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, రాంరెడ్డి, గౌస్, కదిరే శ్రీనివాస్, రాజేందర్, సతీశ్, అనవేణి రవి, బుచ్చాగౌడ్, మధు, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆర్థికసాయం



చిన్నారులకు ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండ్ అందిస్తున్న పూర్వ విద్యార్థులు

ఎల్లారెడ్డిపేట: అనారోగ్యంతో మృతిచెందిన స్నేహితురాలి కుటుంబానికి పూర్వ విద్యార్థులు చేయూతనందించారు. మండల కేంద్రానికి చెందిన సంగ మల్లయ్య– మల్లవ్వ దంపతుల పెద్ద కూతురు నిర్మల గత నెల 14న అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న 2006–07 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు విరాళాలు పోగుచేసి రూ.50వేలు నిర్మల కూతురు సాన్విక పేరుపై ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి బాండ్ అందజేశారు. పృథ్వీధర్‌రెడ్డి, విజయ్, కృష్ణారెడ్డి, ప్రశాంత్, శ్రీకాంత్, ఇంతియాజ్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

రంగుమారిన 'భగీరథ'



చందుర్తి(వేములవాడ): మండల కేంద్రంలో మంగళవారం కలుషిత తాగునీరు సరఫరా అయ్యింది. మిషన్ భగీరథ ద్వారా సరఫరా చేస్తున్న తాగునీటి రంగు మారడంతోపాటు పురుగులు వచ్చాయని చిలుక భూమేశ్ వాపోయాడు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పైపులైన్ లీకేజీ ఉంటే సరిచేయాలని మండల కేంద్ర ప్రజలు కోరుతున్నారు.

బోనాలు.. గోరింటా





ఇల్లంతకుంట/కోనరావుపేట: మండలంలోని కందికట్కూర్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం బోనాల పండుగ నిర్వహించారు. విద్యార్థులు నెత్తిన బోనాలతో పోచమ్మతల్లికి నైవేద్యం సమర్పించారు. హెచ్‌ఎం రవీందర్‌రెడ్డి, రాజు, అంగన్వాడీ టీచర్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలం కనగర్తిలోని ప్రాథమిక పాఠశాలలో మంగళవారం గోరింటాకు ఫెస్టివల్ నిర్వహించారు, విద్యార్థులు చేతులకు గోరింటాకు పెట్టుకున్నారు. హెచ్‌ఎం నర్సయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.